# కదనకేళిక

## శిరపల్లె వీణావాణి

తూర్పు ఆకాశం ఎరుపెక్కి... తూర్పు కొండల నడుమ సూర్యగోళం ఉదయిస్తే... ఆ హరిజన వాడలో వైకుంఠ ఏకాదశి పండగ. ఆ పండగ సందర్భంగా ఆ ఊరి ప్రజల జాగరణ నిమిత్తం ఆ రాత్రికి కురుక్షేత్రం అనే పౌరాణిక వీధినాటకం ఆ హరిజన వాడలో ప్రదర్శింపబడుతుంది. పండగ పసందుగా జరుగుతుంది.

తూర్పు ఆకాశం ఎరుపెక్కింది. తూర్పు కొండల నడుమ సూర్యగోళం ఉదయించింది. కానీ ఆ హరిజనవాడలో ఎవరూ వైకుంఠ ఏకాదశి పండుగను జరుపుకోలేదు. వీధి నాటకం కూడా ప్రదర్శింపబడలేదు. అయితే ఆ రాత్రి ఆ హరిజనవాడలో ప్రతి ఒక్కరూ జాగరణ మాత్రం చేశారు. ఎవరూ కునుకు తియ్యలేదు.

కానీ... ఆ జాగరణ వాళ్ళు మోక్షం మీది ఆశతో చేసింది కాదు. మోడుబారిపోయిన తమ బ్రతుకుల్ని చూసి సాంఘికన్యాయానికి రోసి... హృదయ విదారకంగా విలపిస్తూ బ్రతుకుపట్ల భయంతో చేసిన జాగరణ అది. మానవజాతిలోని ఆటవిక జంతు స్వభావాన్ని చూసి ఆ రోజు పుడమితల్లి పుట్టెడు దుఃఖంలో కూరుకుపోయింది.

ఆరోజు...

ఉదయం పదకొండు గంటలు కావస్తోంది. సిరిపురం హరిజనవాడ పొలిమేరవద్ద విశాలంగా వ్యాపించిన మర్రిచెట్టునీడలో జనం గుంపుగా చేరి ఉన్నారు. ఆ రాత్రికి ప్రదర్శింపవలసిన వీధినాటకం రిహార్సల్స్ జోరుగా సాగుతోంది.

"సుకమా? మన రాజ్యామెల్లా జయమా?
యింతులకును వేదాంతులకును,
మన సెంతనున్న సామంతులకును,
సుకమా? మన రాజ్యామెల్లా జయమా?" అంటూ

దుర్యోధన పాత్ర ధరింపబోయే ఆసాది గోవిందు రాగయుక్తంగానూ తాళబద్ధంగానూ పాట పాడుతూ అభినయం చేయసాగాడు.

"సుకమే మన రాజ్యామెల్లా జయమే
యింతులకును వేదాంతులకును
మన సెంతనున్న సామంతులకును
సుకమే మన రాజ్యామెల్లా జయమే" అంటూ

మంత్రి పాత్ర ధరించబోయే మరిడయ్య దుర్యోధనుని ప్రశ్నకి సమాధానం చెబుతూ తనూ పాట అందుకున్నాడు.

వీధి నాటకంలో వేషం వెయ్యడం మరిడయ్యకి అదే మొదటిసారి. అందుకే అతడు రాగయుక్తంగా పాడలేక పోతున్నాడు. తాళం, మద్దెల ఓ దారిన పోతుంటే... మరిడయ్య పాట వాటితో సంబంధం లేకుండా మరోదారిన పోతూవుంది. పాట కర్ణకఠోరంగా ఉంది.

"హారేయ్ మరిడయ్యా! యేందిరా ఆ పాట పాడడం? అది పాటా? లేక మోటకాంపల్లి సెరువు మోతా?" కసురుకున్నాడు మల్లన్న. మరిడయ్య అవమానంతో తలదించుకున్నాడు.

"ఒరేయ్! ఈ రాత్రికి నువ్ యాషం యేస్కొని ఈ మాదిరిగానే పాడినావంటే సూసే జనాలు సెప్పుల్తో కొడతారు. నిన్నుగాదు మీకు ఈ ఆట నేర్పించిన వాద్దేర్ని నేనుగదా. అందుకని ముందు నన్ను కొడతారు. ఈ ఆట మనం ఆడాల్సింది ఈ రాత్రికే. యెప్పుడోగాదు" అంటూ మరిడయ్యని మందలించాడు మల్లన్న.

ఆ గ్రామీణ ప్రాంతంలో అది ఏ నాటకమైనా సరే దాన్ని ఆట అనే పేరుతో వ్యవహరిస్తారు. నాటకాన్ని నేర్పించే వ్యక్తిని 'వాద్దేరి' అని పిలుస్తారు. ఆ జానపదుల పరిభాషలో 'ఆట' అంటే నాటకమని, వాద్దేరి అంటే నాటకం నేర్పించే గురువుగారని అర్థం.

ప్రస్తుతం వాళ్ళ వాద్దేరి మల్లన్న.

మల్లన్నకి నా అనే వాళ్ళెవరూ లేరు. వాడి అని చెప్పుకోడానికి ఓ స్వంత ఊరంటూ లేదు. పల్లెటూరి వీధినాటకాలని ఆడే వాళ్ళంతా తన వాళ్ళే. ఆ నాటకాలు ఆడబడుతున్న ఊళ్ళన్నీ తన ఊళ్ళే. పౌరాణిక వీధినాటకాల్ని జానపదులకు నేర్పించడంలోనే మల్లన్న తన జీవితాన్ని మొత్తం గడిపేస్తున్నాడు.

ఆ చుట్టుపక్కల పల్లెటూళ్ళలో గొప్ప వాద్దేరిగా మల్లన్నకి మంచి పేరుంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసినా అనుమానం లేకుండా అతడు గెలుస్తాడని ఓ ప్రతీతి.

ఆ ప్రాంతంలో మల్లన్నను ఎరుగని జానపదుడు లేడు. ఏ ఊళ్ళో ఎవరు ఏ పౌరాణిక వీధినాటకాన్ని నేర్చుకోవాలనుకున్నా మల్లన్న దగ్గరికి రావలసిందే. తమకి వీధి నాటకం నేర్పించి వాద్దేరిగా వ్యవహరింపవలసిందిగా తాంబూలం పెట్టి మల్లన్నని ప్రాధేయపడాల్సిందే. 'నావల్ల కాదు' అనే మాట మల్లన్న నోట్లోంచి ఏనాడూ రాదు.

"హారేయ్ మరిడయ్యా! వొక దినంగాదు రెండు దినాలుగాదు. ఆరు నెలల్నుంచి హొద్దికి జరగతా వుండాది గదా. ఇన్నాళ్ళుగా నువ్ యేం నేర్చుకున్నట్లు? నీకు నేర్పించేయాలకి నాపనై పోయేటట్టుంది. సరే వొళ్ళు సోదీనంలో పెట్టుకుని జాగర్తగా మళ్ళీ పాడు" అంటూ మరిడయ్యవేపు చూస్తూ హెచ్చరింపుగా అన్నాడు మల్లన్న.

వాళ్ళ భాషలో 'హొద్దిక' అంటే రిహార్సల్స్ అని అర్థం. మరిడయ్య మళ్ళీ పాట మొదలెట్టాడు.

"సుకమే మన రాజ్యామెల్లా జయమే
యింతులకును వేదాంతులకును
మన సెంతనున్న సామంతులకును
సుకమే మన రాజ్యామెల్లా జయమే" అంటూ మరిడయ్య అలా పాట ప్రారంభించేసరికి...

"ఆపండ్రా! మీ యమ్మల"... అంటూ గట్టిగా అరుస్తూ సంధించిన బాణంలా అక్కడికి దూసుకొచ్చాడు నరసింహులు. అతని అరుపు వినడంతోనే మరిడయ్య పాట హఠాత్తుగా ఆగిపోయింది. అరక్షణంలో అక్కడంతా నిశ్శబ్దం అలుముకు పోయింది.

పెరిగిన గడ్డం... తాటిపీచులాంటి తల... బక్కచిక్కిన దేహం... పీక్కుపోయిన ముఖం... గుంటలు పడిన కళ్ళు... ఒంటిమీద మాసికలు వెయ్యబడిన ఒకే ఒక పంచె... ఇది అతని రూపం. ఆ ఊళ్ళో అందరూ అతడిని పిచ్చి నరిసిమ్ములని పిలుస్తారు.

"హారేయ్ మరిడయ్యా! యేందిరా నువ్ పాడే ఆ పాట? దానికేవన్నా అర్థం పర్థం ఉందాద్రా? యెవ్రురా సుకంగా వుండేది? యెవురి రాజ్జివురా సుకంగా ఉండేది. సెప్పరా య్రే రిపాటలు పాడే యెర్రినాకొడకా?" అంటూ గదమాయించాడు నరసింహులు.

సిరిపురం గ్రామ సర్పంచ్ వెంకటపతి నాయుడిగారి రెండో కొడుకు మూడేళ్ళ క్రితం తన మానం చెరిచినందుకు సీతాలు ఉరేసుకుని చనిపోయింది. తన భార్య మరణం చూసి నరసింహులు గుండెల్ని బాదుకున్నాడు. సీతాలు అతనికి ఆరో ప్రాణం.

పెళ్ళాం పోయినప్పటి నుండి నరసింహులుకు మతి భ్రమించిందని ఆ ఊళ్ళో అందరి అభిప్రాయం. నిజానికి వాళ్ళందరూ అనుకుంటున్నట్టు అతడు

పిచ్చివాడు కాదు.

"వారేయ్ యెర్రినాకొడకా! మనకి యేనాటికీ సుకం వుండదురా. మనకా రాత లేదురా. మనం పుట్టింది సుకపడడానిక్కాదురా. మారాజుల్ని సుక పెట్టేందుకురా. వారేయ్! అట్టా సూడు. వోళ్ళకి.. వోళ్ళకిరా సుకముండేది. వోళ్ళ రాజ్జివురా సుకంగా ఉండేది" అంటూ నరసింహులు తన కుడిచేయి పైకెత్తి దూరంగా చూపించాడు.

అక్కడున్న వాళ్ళంతా నరసింహులు చూపించిన దిక్కుకు తలలుతిప్పి చూశారు. అక్కడికి ఆరఫర్లాంగు దూరంలో ఉన్న 'సిరిపురం' అనే గ్రామం ద వాళ్ళ చూపులు కేంద్రీకృతమయ్యాయి. ఆ గ్రామం పేరుకుతగ్గట్టుగానే ఉంటుంది. ఆ గ్రామంలో సంపన్న కుటుంబాల సంఖ్య అధికం. ఆ ఊళ్ళో అందరూ అగ్రవర్ణానికి సంబంధించిన వాళ్ళే.

ప్రభుత్వం ఎలాంటి గ్రామీణ పథకాన్ని తలపెట్టినా... సిరిపురంలో ఆ పథకం తప్పకుండా అమలు పరచబడుతుంది. పాలకవర్గంలో ఆ ఊరికి మంచి పలుకుబడి ఉంది. ఆ ఊళ్ళోని భవనాలు ఆకాశాన్ని తాకుతూ ఆ ఊరివైభవాన్ని చాటుతూ ఉంటాయి. ప్రతిభవనం మీద ఒక టీవీ ఆంటినా తెల్లగా మెరుస్తూ ఉంటుంది.

"యిప్పుడు సెప్పరా మరిడయ్యా! నువ్ ఆ పాటలో సెప్పినట్టు అందరూ సుకంగా వుండారట్రా? రాజ్జివంతా సుకంగా వుందట్రా?" మరిడయ్యని నిలదీసి అడిగాడు నరసింహులు.

మరిడయ్యకి ఒళ్ళు మండిపోయింది. మల్లన్న మాత్రం నరసింహులునే తదేకంగా చూస్తున్నాడు

"వారేయ్ యెర్రి మొగమా! ఆ మారాజులూ మనవూ వొగటైపోయి, ఒక బతుకు బతికినప్పుడు, వోళ్ల రాజ్జానికీ మన రాజ్జానికీ మద్దిన వుండే అడ్డులు సెరిగిపోయినప్పుడూ... అప్పుడు... పాడండ్రా ఇట్టాంటి పాటలు. అంతేకాని... యిప్పుడు మాత్రం అర్దం పర్దంలేకండా పాడబోకండ్రా" చాలా అసహనంగా అన్నాడు నరసింహులు.

అతని గుండెల్లో రగులుతున్న ఆవేదనను తన పరిధిలో అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు మల్లన్న.

"యిట్టా సూడు వాద్దేరీ! నువ్ తలాతోకా లేని యిట్టాంటి పాటల్నీ, ఆటల్నీ మావోళ్ళకి నేర్పించ



మాకయ్యా!" అంటూ మల్లన్నవేపు కోపంగా చూశాడు నరసింహులు.

"హారేయ్ పిచ్చినాకొడకా! నువ్ ఈడనుంచి పోతావా లేదా? తాళంమద్దిలితో పాటకుదరక యీడ మాతాడలు మేం పడతావుంటే మద్దిలో నువ్వొకడి వి వందిట్లో నవారాదన మాదిరిగా" అంటూ మరిడయ్య నరసింహులును కసురుకున్నాడు.

నరసింహులుకి కోపం వచ్చింది.

"నేను కాదురా పిచ్చినాకొడుకును. మీరే... మీరే పిచ్చినాకొడుకులు. సిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టమన్నారురా పెద్దోళ్ళు. కానీ... మీరు పెద్దపామును సూసినా సిన్నకర్రను కూడా సేతికి తీసుకోరు. వొకయాళ వాబోటోడెవడన్నా సిన్న కర్రను సేతికి తీసుకుంటే దాని బుసలకి భయపడి మీరా కర్రను లాగి పారేస్తారు. పెపంచంలో మీకంటే యెవుర్రా పిచ్చినాకొడుకులు?" అన్నాడు నరసింహులు.

"హారేయ్ నరసిమ్మా! యిన్నుంచి మరియాదగా యెల్లిపో, లేకపోతే నీ యీపు యిమానం మోత మోగిపోతాది" అంటూ అక్కడ నేలమీద పడివున్న ఓ కర్రను చేతికి అందుకుని నరసింహులివేపు ఉరిమి సూశాడు ఆసాది గోవిందుడు.

"సూసినావా వాద్దేరి! యీడి పెతాపం యెవురి మీద సూపిస్తున్నాడో! హారేయ్ గోయిందూ! నా మీదికి జోరుగా లేస్తున్న నీ సేతికి ఇంతకుముందు పచ్చివాతం వొచ్చిందంట్రా?" గోవిందు వేపు ఆసహ్యంగా సూసి వెళ్ళిపోయాడు నరసింహులు.

"వాద్దేరీ! వోడి మాటలు పట్టించుకోబోక. ఆ పిచ్చినాకొడుకెప్పుడూ అంతే. వొకపక్క వోళ్లకాట్లో తన పెండ్లాంపీనిగ కాలతావుంటే... ఇంకోపక్క కత్తి సేత్తో పట్టుకుని యెంకటపతి నాయుడు గోరి కొడుకు తలను నరికేద్దామని పరిగెత్తిన యెర్రినాయాలువోడు" మల్లన్నతో అన్నాడు ఆసాది గోవిందుడు.

"తొక్కితే నలిగిపోయే గడ్డిపోస... యేనుగు పైకి యివారానికి పోతే యేం జరగతాదో తెలవని అమాయకుడు నరసిమ్ములు. యెంకటపతి నాయుడి గోరి కొడుకేంది? ... నరసిమ్ములేంది? వోళ్ళంతా మారాజులు, ఆకాసాన్ని భూమ్మీదికి తెప్పించగల గొప్పోళ్ళు. వోళ్ళతో మా బోటోళ్ళకి యివారమేంది?" అన్నాడు మరిడయ్య.


"ఆ పొద్దు వోడు కత్తిపట్టుకుని కిలారిస్తా పరిగెత్తా వుంటే మేం పదిమంది సూసి... నరసిమ్ముల్ని గెట్టిగా పట్టుకుని నవాలించబట్టి సరిపోయింది. లేకుండా వుండే యేం జరిగుండేది వాద్దేరీ? తలతెగి భూమ్మీద పడుండేది. యెవుర్ది? నరసిమ్ముల్ది" అన్నాడు మల్లన్నవద్దకి వస్తా తలారి జగన్నాధుడు.

"యెంకటపతి నాయుడుగోరిగ్గాని, సిరిపురంలోని మారాజులగానీ... ఈ మాదిరిగా నరసిమ్ములు కత్తిపట్టుకుని సేసిన ఆగడం ఇప్పటిదాకా తెలవదు. ఆ యిసయం మా మాలపల్లిలోనే అనిగిపోయింది. ఆ మారాజులకి యీయిసయం తెల్సుంటే... నరసిమ్ములుకి యెప్పుడో నూకలు సెల్లి పోయేవి" మురగయ్య అన్నాడు.

వెంకటపతి నాయుడుగారి పుత్రరత్నం చేసిన దురాగతం గురించి మల్లన్న గతంలో విన్నాడు. కానీ ఆ దురాగతం గురించి ప్రస్తుతం వాళ్ళెవరూ ప్రస్తావించకపోవడం... మల్లన్నకి ఆశ్చర్యం వేసింది.

"హారేయ్! పొగులుమాటలు పనికి పంచేటు, రాత్రి మాటలు నిద్దరకు పంచేటు, మీరు కానియ్యండి. ఈ రాత్రికే మనం ఆట ఆడాల్సింది" నాటకం విషయం గుర్తుచేసి, ఇక రిహార్సల్స్ మళ్ళీ ప్రారంభించండి అన్న ధోరణిలో మాట్లాడాడు ఆదెప్ప.

ఆవాళే వైకుంఠ ఏకాదశి అని, ఆ రాత్రికే వాళ్ళు కురుక్షేత్రం వీధినాటకం ప్రదర్శించవలసి వుంటుందని ఆదెప్ప గుర్తుచెయ్యడంతో వాళ్ళు రిహార్సల్స్




మళ్ళీ ప్రారంభించారు. ఆ నాటకంలో ఆదెప్ప దుశ్శాసనుని పాత్రను ధరించబోతున్నాడు. ఆజానుబాహుడైన తలారి జగన్నాధుడు భీముని పాత్రను ధరించబోతున్నాడు.

"నిలు నిలు నిలువుమురా! నీకు నూరేళ్ళునిండెనురా!
పారిపోక నిలబడురా! నీ పచ్చి నెత్తురు తాగెదరా!"

అంటూ యుద్ధభూమిలో ప్రాణభీతితో పారిపోతున్న దుశ్శాసనుని వెంటపడి తరిమే ఘట్టాన్ని అభినయిస్తూ భీమ పాత్రను ధరించబోయే జగన్నాధుడు రాగయుక్తంగా పాట పాడసాగాడు.

ఇంతలో...

"హారేయ్ జగన్నాధా! మరిడయ్యా! గోయిందూ! రండ్రా! అందురూ పరుగున రండ్రా!" అంటూ ఆయాసపడుతూ అమితవేగంగా అక్కడికి దూసుకొచ్చాడు తోటి పాపన్న.

"యేంది పాపన్నా? కొంపలు కాలిపోతావున్నట్టు అరస్తా వుండావు?" అడిగాడు ఆదెప్ప.

"అవున్నా ఆదెప్పా! కొంపలు కాలిపోతుండాయిరా. అందరూ బయల్దేరండ్రా! వొట్టి సేతుల్తో కాదు కత్తులూ, కటార్లూ, గొడ్డళ్ళూ, బరిసెలు పట్టుకుని ఆలీసం సెయ్యకుండా బయల్దేరండ్రా" అంటూ ఆయాసంతో రొప్పసాగాడు పాపన్న.

"యేంది పాపన్నా! యేం జరిగింది.? సరిగా సెప్పరాదా"? ఆత్రంగా అడిగాడు గోవిందుడు.

"హారేయ్ గోయిందూ! ఈ పొద్దు మనం సేతులు ముడుసుకుని కూచ్చుంటే... ఈ సిరిపురం మాలోళ్ళు సింతాకుక్కూడా కొరగానోళ్ళని మన గురించి సుట్టుపక్కల అందరూ అనుకుంటార్రా"

"ఛూ నీయమ్మ... యేం జరిగిందో సెప్పరా అంటే సెప్పవేంది?" అసహనంగా అన్నాడు జగన్నాధుడు.

"జగన్నాదా! ఆ సింతలపాళెం మాలోళ్ళు యీపూ పొద్దు... కట్టుబాటును కూడా కాలదన్ని"... అసలు విషయం చెప్పాడు పాపన్న.

అతడు చెప్పింది వినగానే...

అక్కడున్న వాళ్ళందరి ఒంట్లోని రక్తం సలసల మరిగిపోయింది. వాళ్ళ గుండెల్లోని పౌరుషం పాములా పడగెత్తి బుసలుకొట్టింది. అందరి పిడికిళ్ళూ ఒక్కసారిగా బిగుసుకున్నాయి. వాళ్ళందరిలోనూ పట్టుదల పరాకాష్ఠకు చేరుకుంది. అప్పటివరకు ప్రశాంతంగా ఉన్న అక్కడి వాతావరణం... హఠాత్తుగా అగ్నిగుండంలా పరిణమించింది.

"సింతలపాళెం మాలోళ్ళు యింత అన్యాయానికి వొడిగట్టినారంటే... వోళ్ళకెన్ని గుండికాయలా? మనం అంత సులకనగా వుండావా? వోళ్లేనా మొగోళ్ళు? ఈడ మనం యెవురూ గాజులు తొడుక్కోలేదు" అన్నాడు చాలా కోపంగా మరిడయ్య.

"మన సిరిపురం మాలోళ్ళ మీదికి కాలు గీరడానికి వోళ్ళకెంత దయిర్నం? పదండ్రా! యీపొద్దు వోళ్ళ పని యేందో అంతుసూడాల. ఆ నాకొడుకుల్ని గంగమ్మజాతర్లో దున్నపోతును నరికినట్లు నరికి పారె

యాల" అమిత ఆవేశంగా అన్నాడు తలారి జగన్నాధుడు.

"యీపొద్దు మన తడాకా యేందో పోయి మాపించాలి వోళ్ళ పెండ్లాల తాడో, మన పెండ్లాల తాడో తెగిపోవాల. ఆ నాయాండ్లు ఈ పొద్దు యీదం పక్క నిద్దర్లేసి వట్టుండారు. వోళ్ళ తలకాయలు యెగిరిపోవాల. పదండ్రా" అన్నాడు ఆసాది గోవిందుడు.

"అవున్నా! పదండి. వోళ్ళ పెండ్లాలు యీదినంతో ముండమొయ్యాల. యీపొద్దు ఇంతపని సేసినోళ్ళు రేపు ఇంకెంత పనైనా సేస్తారు. సింతలపాళెం మాలోల్లకి పానాలతో యిడ్సి పెట్టేది లేదు. పదండి' వళ్ళు కొరుకుతూ అన్నాడు మురగయ్య.

"నాయాండ్లకి కాళ్ళూ సేతులూ యింటెయ్యాల. మల్లా యీజల్మలో వోళ్ళు మన జోలికి రాగూడదు. కత్తులూ, కటార్లూ తీసుకుని యింగా వూళ్ళో ఉండే వోళ్ళందర్నీ పిల్సుకుని యెల్దాం పదండి" అంటూ ఆదెప్ప పూనకం వచ్చినవాడిలా ఊళ్ళోకి పరుగుతీశాడు.

ఒక్క మల్లన్న తప్ప... మిగిలిన వాళ్ళంతా ఆదెప్పను అనుసరించారు. మల్లన్న ఒక్కడే ఆ మర్రిచెట్టు నీడలో మిగిలిపోయాడు. ఆ అమాయకుల ఆవేశాన్ని అదుపులో పెట్టడానికి తన శాయశక్తులా ప్రయత్నం చేసిన మల్లన్న ఓడిపోయి ఒంటరిగా మిగిలాడు.

సిరిపురం హరిజన వాడలోంచి ఓ యాభై మంది మనుషులు ముందుకు దూసుకుపోతున్నారు. అందరి చేతుల్లోనూ కత్తులూ, గొడ్డళ్ళు, బరిసెలు, కర్రలూ రకరకాల ఆయుధాలున్నాయి. వాళ్ళందరి ముఖాలు ఉద్రేకంతో ఎర్రగా జేవురించి ఉన్నాయి.

తోకలు తొక్కబడ్డ సర్పసమూహాల్లా వాళ్ళంతా బుసలు కొడుతున్నారు. వాళ్ళలో ప్రతీకారమే జీవనాడిగా పరిణమిస్తూ వుంది. చెలియలికట్టని ఛేదించ ప్రయత్నించే కడలి తరంగాల్లా... ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో వాళ్ల ఎదలు ఎగిసెగిసి పడుతున్నాయి

బ్రద్దలైన అగ్ని పర్వతపు లావాలా... గండిపడ్డ తటాకపు జలప్రవాహంలా... ఉరవడిగా, ఉధృతంగా, ఉద్రేకంగా నాగాలమ్మ చెరువు వేపు వాళ్లందరూ పరుగిడుతుండగా... దారిలో వాళ్లకి ఎదురు పడ్డారు వెంకటపతినాయుడు అతని తొత్తు రామాంజనేయులు.

"ఏందిరా మరిడయ్యా ఇది? మీ మాలోళ్ళంతా పోలోమంటూ కత్తులూ, కటార్లూ పట్టుకుని పరుగుల్దీస్తున్నారు" తనకి ఏమీ తెలియనట్లు అమాయకంగా ముఖం పెట్టి అడిగాడు వెంకటపతినాయుడు. ఆయన అలా ఎదురుపడి ప్రశ్నించడంతోటే పరుగెడుతున్న వాళ్ళంతా ఠక్కున నిలబడి ఆయన చుట్టూ గుంపుచేరారు.

"సెప్పాలంటే మాకు తలవొంపులుగా ఉంది సామీ! ఆసింతల పాళెం మాలోళ్ళు యింతకి తెగిస్తారనుకోలేదు. తరతరాల్నుంచి వొచ్చే కట్టుబాటును ఆశారాన్ని వొదిలిపెట్టి వోళ్ళు యీపొద్దు" అంటూ ఆవాళ చింతలపాళెం హరిజనులు చేసిన నిర్వాకం గురించి ఆయాసంతో రొప్పుతూ వెంకటపతినాయుడితో చెప్పాడు మరిడయ్య.

"భూమ్మీద దూమకేతువులు పుడతాయనీ, ఆ సల్లని సెంద్రుడు గూడా నిప్పులు కురిపిస్తాడనీ యీరబెమ్మంగారు చెప్పిన ఆ కలికాలం రానే వొచ్చేసింది. కాకపోతే ఆ సింతలపాళెం మాలోళ్ళు యిట్టాంటి నీతిలేని పనులు సేస్తారా? వారేయ్ మరిడయ్యా! మీ కెట్టుందోగానీ... నాకు మాత్రం తలకొట్టేసినంత అగుమానంగా వుంది" అన్నాడు రామాంజనేయులు.

"వారేయ్! మరిడయ్యా! గోయిందూ! జగన్నాదా! మీరేం భయపడాల్సిన పన్లేదు. హోంమంత్రి, మన జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ అంతా మనోళ్ళే. ఆ యవారమంతా నేను యెనకుండి సూసుకుంటా. మీరు మాత్రం సింతలపాళెం మాలోళ్ళ తలకాయల్ని తెగెయ్యండి" అంటూ వాళ్ళంతా నమ్మేలా హామీ ఇచ్చాడు వెంకటపతినాయుడు.

"సామీ! తమరు ఈ మాత్రం దయిర్నం సెప్పినారంటే... పొరకాయల్ని కోసేసినట్టు సింతలపాళెం మాలోళ్ళ గొంతులు కోసెయ్యమా? వారేయ్! పదండ్రా! మనకింకేం దిగుల్లేదు. అంతా అయ్యగారే సూసుకుంటారు" అంటూ ముందుకు ఉరికాడు జగన్నాదుడు. అతనితోపాటు మిగిలిన వాళ్ళంతా ఉత్సాహంగా దూసుకుపోయారు

గత అసెంబ్లీ ఎన్నికల్లో వెంకటపతినాయుడు బలపరిచిన అభ్యర్థి ఓడిపోయాడు. కారణం ఆ ప్రాంతంలోని హరిజనుల ఓట్లన్నీ ఆయన బలపరిచిన అభ్యర్థికి పడలేదు. పైగా ఇటీవల చింతలపాళెం హరిజనులూ సిరిపురం హరిజనులూ ఒకటై కూలీరేట్లు పెంచేవరకు సమ్మెచేసి పొలాల్లోకి దిగలేదు.

"రామాంజనేయులూ! కురుక్షేత్రం నాటకం ఇక నాగాలమ్మ చెరువులో జరగబోతాదయ్యా! ఈ నాకొడుకులు నరుక్కొని చస్తారు. మనం సనిగలు తిని సెయ్యి కడుక్కున్నట్టుగా వుండిపోతాం. యెవుడికమ్మును వోడి సేత్తోనే సొడిపించకపోతే... వోడికమ్మ మనమీద పడతాదయ్యా" అంటూ సంబరపడిపోయాడు వెంకటపతినాయుడు.


సిరిపురం గ్రామానికి సరిగ్గా ఉత్తరంవేపు రెండు కిలోమీటర్ల దూరంలో చింతలపాళెం అనే గ్రామం ఉంది. ఆ రెండు గ్రామాలమధ్య భాగంలో అయిదడుగుల ఎత్తుగల ఒక రాతిస్తంభం భూమిలోకి నిటారుగా పాతిపెట్టబడి ఉంది.

## రచయిత పరిచయం



కలం పేరు వీరపల్లె వీణావాణి. అసలు పేరు వి. ఆంజనేయులు నాయుడు. పుట్టింది, పెరిగింది చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలంలోని వేటమిట్ట అనే ఓ చిన్న కుగ్రామం. ఎం.ఎ., ఎం.ఫిల్ వరకు చదువుకున్నది, యస్.వి.యూనివర్సిటీ తిరుపతిలో. ప్రస్తుతం తెలుగు లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తున్నది, నెల్లూరు జిల్లా కావలి జవహర్ భారతి కళాశాలలో. ఆరు నవలలు, డెబ్బై కథలు, రెండొందల కవితలు, ఏడు వ్యాసాలు ప్రముఖ దిన, వార, మాసపత్రికల్లో ప్రచురింపబడ్డాయి. 'దావానలం, సాలభంజిక, వ్యస్తాక్షరి, పితృదేవోభవ' ఇవీ రచించిన నాటికలు, నాటకాలు. మహామనస్వి, కథాతపస్వి, మధురాంతకం గారు నాలోని ఈ స్వల్ప సృజనాత్మక శక్తికి బీజం వేశారు. ఈతరం రాయలసీమ రచయితల్లో డా. పి. కేశవరెడ్డి నా ఏకైక అభిమాన రచయిత. మంచి కవిత్వం రాసేవారంతా అభిమాన కవులే. నిజాయితీ లేని మేధావుల కంటె నీతిగల అమాయకులంటె గౌరవం. గతంలో రెండు నవలలకి, రెండు కవితలకి రెండు కథలకి బహుమతులొచ్చాయి.

వీరపల్లె వీణావాణి, కావలి.



ఆ రాతిస్తంభాన్ని 'హద్దురాయి' అంటారు. అటువంటి హద్దురాళ్ళు కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి రెండు గ్రామాల మధ్య ఉంటాయి. జనపద జీవితంలోని కొన్ని కట్టుబాట్లకూ, సాంఘిక ఆచారాలకీ ఆ హద్దురాయి ఒక సంకేతం. అయితే యిలాంటి హద్దురాళ్ళు అన్ని గ్రామీణ ప్రాంతాల్లోనూ ఉండకపోవచ్చు.

వాగాలమ్మ చెరువులోని ఆ హద్దురాతికి దక్షిణ దిక్కున సిరిపురం, ఉత్తరం దిక్కున చింతలపాలెం వున్నాయి. కనుక ఆ హద్దు రాతికి ఉత్తరం వేపు వెళ్ళిన ఏ పశువైనా చనిపోతే, ఆ పశువు సిరిపురం రైతులదైనా సరే. ఆ పశుకళేబరం మీద సిరిపురం రైతులకు గానీ, సిరిపురం హరిజనులకుగానీ ఎలాంటి హక్కూ ఉండదు.

కారణం ఆ పశువు హద్దురాతిని దాటి అవతలికి వెళ్ళి చనిపోయింది కనుక. దాని కళేబరం మీద చింతలపాలెం హరిజనులకే సర్వాధికారాలూ ఉంటాయి.

ఒకవేళ... ఆ పశువు ఆ హద్దురాతికి యివతలి వేపుకు అంటే దక్షిణందిక్కుకు వచ్చి చనిపోతే... ఆ పశుకళేబరం మీద ఆయి వేపున్న చింతలపాలెం రైతులకు గానీ, చింతలపాలెం హరిజనులకుగానీ ఎలాంటి అధికారమూ ఉండదు కారణం ఆ పశువు హద్దురాతిని దాటి ఇవతలి వేపుకొచ్చి చనిపోయింది కనుక.

ఆ పశువు చింతలపాలెం రైతులదే అయినా దాని కళేబరం మీద సిరిపురం హరిజనులకే సర్వాధికారాలూ ఉంటాయి. ప్రస్తుతం చింతలపాలెం రైతులకు సంబంధించిన ఒక ముసలి ఎద్దు... ఆ వాగాలమ్మ చెరువులో గడ్డిమేస్తూ... ఆ హద్దురాతిని దాటి ఇవతలి వేపుకు... అంటే సిరిపురం గ్రామంవైపైన దక్షిణం వేపుకొచ్చి... అనారోగ్య కారణంవల్ల చనిపోవడం జరిగింది.

అది చూసిన చింతలపాలెం హరిజనులు గబగబా ఆ ఎద్దుకళేబరాన్ని హద్దురాతికి అవతలివేపుకు లాక్కెళ్ళిపోయారు. వాళ్ళు అలా లాక్కెళ్ళడం చూసిన పాపన్న ఆ కళేబరం మాకు చెందాలి అంటూ చింతలపాలెం హరిజనులతో తగువు పెట్టుకున్నాడు. వాళ్ళు పాపన్న వాదనను లెక్కచెయ్యలేదు. పైగా అడ్డం పడి నందుకు వాళ్ళు పాపన్నను చావుదెబ్బ కొట్టి వదిలారు. వెంటనే పాపన్న పరుగుపరుగున తమ హరిజనవాడకొచ్చి ఆ తతంగం గురించి చెప్పాడు.

వాగాలమ్మ చెరువులో చనిపోయిన ఎద్దును తమ మనుషులు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారని, అది తెలిసిన సిరిపురం హరిజనులు కత్తులూ, కర్రలూ పట్టుకుని తమ మనుషుల్ని కొట్టడం కోసం వస్తున్నారని వార్త చింతలపాలెం హరిజనవాడకు చేరిపోయింది. వెంటనే ఆ చింతలపాలెం హరిజనులు కూడా కత్తులూ, కర్రలూ, గొడ్డళ్ళు పట్టుకుని వాగాలమ్మ చెరువువేపు దూసుకొచ్చారు.

"వొరేయ్ ఆగండ్రా మీయమ్మల... మా సిరిపురం మాలోళ్ళు చచ్చినారనుకున్నారా బతికి నారనుకున్నారా? మావూరి అద్దుల్లోకొచ్చి చచ్చిపోయిన యెద్దును యెత్తకెళ్ళడానికి యెన్ని గుండెకాయల్రా మీకు? ఆ చచ్చిన యెద్దు మీద మీకు అక్కు లేదు. మరియాదగా దాన్ని మా కొదిలేసి యెల్లిపొండి" అన్నాడు జగన్నాధుడు.

"వొరేయ్ జగన్నాదా! తల తిరిగే మాటలు మాట్లాడొద్దు. యీ యెద్దు అద్దురాతిని దాటి మీవూరి అద్దుల్లోకి వచ్చిన మాట నిజవే. అయితే అప్పుడది సావలేదు. పాణాలతో గురగురమంటా ఉంటే... మా మనుషులు దీన్ని మా అద్దుల్లోకి యీడ్చుకొచ్చేసినారు. మా అద్దుల్లోకి వొచ్చినాకనే ఈ యెద్దు పానం యిడ్చింది. అందువల్ల దీనిమీద అన్ని అక్కులూ మావే" అన్నారు చింతలపాలెం హరిజనులు.

ఆ నీళ్ళులేని చెరువులో నేలమీద ఆ ఎద్దు కళేబరం పడివుంది. ఆ కళేబరానికి ఒకవేపు చింతలపాలెం హరిజనులూ, మరోవేపు సిరిపురం హరిజనులు నిలబడి ఆ కళేబరం మాదంటే మాదని తీవ్రంగా వాదించుకుంటున్నారు. వాళ్ళ నెత్తిమీద ఆకాశంలో గద్దలు వలయాకారంగా తిరుగుతున్నాయి.

ఆ జంతు కళేబరాన్ని కైవసం చేసుకోవడానికి ఇరువర్గాలలోనూ పట్టుదల తీవ్రస్థాయినందుకుంది మాటా మాటా పెరిగింది. యిరువర్గాలలోనూ పౌరుషం పడగవిప్పింది.

"వొరేయ్! మాటల్తో పన్లేదు. అడ్డం వచ్చినోన్ని యేసేయండి" అన్నాడు రెచ్చిపోతూ ఆదెప్ప.

"రండ్రా తాడోపేడో తేల్చుకుందాం" ఆగ్రహంతో ముందుకు దూకేశారు చింతలపాలెం హరిజనులు.

"యెయ్యండి నాకొడకల్ని"

"వొరేయ్! కొట్టండ్రా!"

"వోన్ని యిడ్చిపెట్టకండ్రా!"

"వోయమ్మో!" ఒకడి చావుకేక

అక్కడ కర్రలూ, కత్తులూ, గొడ్డళ్ళూ వీరవిహారం చెయ్యసాగాయి. అంతా అరుపులు... ఏడుపులూ... చావుకేకలు... చచ్చిన ఓ జంతు కళేబరం కోసం... బతికున్న మనుషులు కొట్టుకు చస్తున్న దృశ్యం...

వాళ్ళ దేహాలనుండి వేడి నెత్తురు చిమ్ముకొచ్చింది. ఆ చెరువంతా ఒకటే వాసన. పచ్చివాసన... పచ్చినెత్తుటి పచ్చివాసన. అంతులేని వాసన... ఛిన్నాభిన్నమైపోతున్న ప్రాణుల వింతవాసన... అనాగరికపు నునవెచ్చని వాసన... ఆ వాసన చూసిన గాలి హఠాత్తుగా స్తంభించి పోయింది. ఆ మారణహోమాన్ని చూసిన ఆకాశంలోని మార్తాండగోళం గజగజా వణికిపోయింది. ప్రకృతి హడలెత్తిపోయింది.

"పారిపోక నిలబడరా నీ పచ్చినెత్తురు తాగెదరా!" అంటూ ఆ రాత్రికి వీధినాటకంలో భీముని పాత్రను ధరించి పాడవలసిన తలారి జగన్నాధుడి తల తెగిపోయింది ఆదెప్ప, మరిడయ్యలు కూడా నేలకూలిపోయారు. చింతలపాలెం హరిజనుల్లో కూడా నలుగురు చచ్చిపోయారు. కాళ్ళూ, చేతులూ విరిగిన వాళ్ళు కొందరు. ఆ రోజు వెంకటపతి నాయుడు పరమానందంతో పండుగ చేసుకున్నాడు.

కానీ... ఆ సిరిపురం హరిజన వాడలో ఎవరూ ఆ రోజు వైకుంఠఏకాదశిపండుగను జరుపుకోలేదు. కురుక్షేత్రం వీధినాటకం కూడా ప్రదర్శింపబడలేదు. అయితే ఆరాత్రి హరిజన వాడలో ప్రతి ఒక్కరూ జాగరణమాత్రం చేశారు. ఎవరూ కునుకు తీయలేదు. అయితే వాళ్ళు ఆ జాగరణ మోక్షంమీది ఆశతో చేసిందికాదు.

ఆ మరుసటి రోజు తెల్లవారుతున్న తూర్పు ఆకాశం ఎరుపెక్కుతుండగా... కాలకృత్యాల్ని తీర్చుకోవడం కోసం హరిజన వాడకు తూర్పు దిశలో వున్న చింతతోపులోకి వచ్చాడు మల్లన్న. అక్కడ... ముళ్ళపొదల మధ్య... నేలమీద పడివున్న నరసింహుల్ని చూసి అతని దగ్గరికి వెళ్ళి నిలబడ్డాడు మల్లన్న.

"వాద్దేరీ! ఈ పల్లిలో యెర్రి నాకొడుకులెపుడో విన్నమన్నే మాస్తివిగ వాద్దేరీ! ఈ సిరిపురం మారాజులూ, ఆ సింతలపాలెం మారాజులూ కూడబలుక్కుని యెంతపని చేసినారో మాస్తివిగద వాద్దేరీ! అద్దులుదాటి... చచ్చిన యెద్దును తీసుకుపోయినందుకే గద వోళ్ళమీదికి మావూరి మాలోళ్ళు పోలోమంటూ యెగబడింది? మరి... బతికున్నవా పెండ్లాం జోలికి... ఆ మారాజులు... అద్దులు దాటి వొచ్చి దాని బతుకుని బుగ్గి చేసినప్పుడు... మా మాలోళ్ళకీ రోసం యిక్కడికి పోయింది వాద్దేరీ?" అన్నాడు నరసింహులు.

మల్లన్న నిట్టూర్చాడు.

"వాద్దేరీ! కురుక్షేత్రం, అరిచ్చెంద్ర, లవకుశ, లంకాదానం యిట్టాంటి ఆటల్ని నువ్వు జనానికి శానా నేర్పించి వుంటావు. కానీ వాద్దేరీ! మా జనాలికి నువ్వు నేర్పించాల్సింది ఇట్టాంటి పనికిమాలిన ఆటల్ని కాదయ్యా! నీకు సేతనైతే... అదో అట్టాంటి ఆటను నేర్పించు" అంటూ నరసింహులు ఓ ముళ్ళపొదవైపు చూపించగానే ఆటు చూశాడు మల్లన్న. అక్కడ బలవంతమైన ఓ విషసర్పం. గింగిలా కొట్టుకుంటూ గింజుకుంటూ వుంది. దాని చుట్టూ చేరి చలిచీమలు ఏకమై దాన్ని పీకేస్తున్నాయి ◯

